పాఠం 15

# వలస పాలిత ప్రాంతాలలో జాతి విముక్తి ఉద్యమాలు

## కీలక భావనలు

- **ఆసియాలో బ్రిటన్ వలసలు:** భారతదేశం, శ్రీలంక, మయన్మార్
- **ఆఫ్రికాలో బ్రిటన్ వలసలు:** నైజీరియా, ఈజిప్ట్, కెన్యా
- **ఆసియాలో ఫ్రాన్స్ వలస:** వియత్నం
- **ఆఫ్రికాలో ఫ్రాన్స్ వలసలు:** అల్జీరియా, మొరాకో, టునిస్
- **ఆసియాలో హాలెండ్ వలస:** ఇండోనేషియా
- **ఆసియాలో స్వతంత్ర దేశం:** చైనా
- **ఆఫ్రికాలో స్వతంత్ర దేశం:** ఇథోపియా, లైబిరియా
- **మంచు వంశం:** 20వ శతాబ్దం ప్రారంభంలో చైనాను పాలించిన వంశం.
- **సన్ యెట్-సేన్:** ఆధునిక చైనా నిర్మాత.
- **సన్, మిన్, చుయి:** ఇవి సన్ యెట్ సేన్ మూడు సిద్ధాంతాలు (సన్ – జాతీయతా వాదం, మిన్- ప్రజాస్వామ్యం, చుయి- సామ్యవాదం)
- **యుద్ధ ప్రభువులు:** చైనాలో స్థానిక సైనిక శక్తులు.
- **మే నాలుగు ఉద్యమం:** వర్సయిల్స్ శాంతి సమావేశం నిర్ణయాలను నిరసిస్తూ బీజింగ్ నగరంలో 1919, మే 4న చేపట్టిన నిరసనను మే నాలుగు ఉద్యమం అందురు.
- **చైనాలోని రాజకీయ పార్టీలు:** గుయోమిండాంగ్ (KMT) , చైనా కమ్యూనిష్టు పార్టీ (CCP)
- **చియాంగ్ కై షేక్:** చైనాను సైనిక దేశంగా మలచడానికి ప్రయత్నించిన గుయోమిండాంగ్ నాయకుడు.
- **సియావో షిమిన్ :** చైనాలో మధ్యతరగతి పట్టణవాసులు.
- **మావో జెడాంగ్:** చైనా కమ్యూనిష్టు పార్టీ నాయకుడు.
- **లాంగ్ మార్చ్:** దీనిని మావో జెడాంగ్ నిర్వహించారు.
- **నూతన ప్రజాస్వామ్యం:** 1949 లో చైనా ప్రజల గణతంత్రం "నూతన ప్రజాస్వామ్యం" అన్న సిద్ధాంతం పై ఏర్పడింది. దీని ఆధారంగా భూస్వామ్య విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ ఏకమయ్యాయి.

www.digitalsocialteacher.in

- భూ సంస్కరణలు: భూస్వాములు దగ్గర గల మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనపరుచుకొని, భూమిలేని రైతులకు పంపిణీ చేయటానికి ఉద్దేశించబడినవే భూ సంస్కరణలు.
- వియత్నం: ఫ్రెంచ్ వలస రాజ్యం.
- యువ అన్నాం పార్టీ: వియత్నంలో రాజకీయ పార్టీ.
- అన్నామీస్ స్టూడెంట్: వియత్నంలో పత్రిక
- ఎన్ గుయెన్ వంశం: వియత్నంలో రాజ వంశం.
- హూ చి మిన్: ఈయన వియత్నం జాతీయ నాయకుడు. వియత్నం కమ్యూనిష్టు పార్టీని ఏర్పాటు చేసి వియత్నం స్వాతంత్రం కోసం పనిచేసారు.
- వియత్నం పై అమెరికా ప్రయోగించిన రసాయనిక ఆయుధాలు: ఏజెంట్ ఆరెంజ్ ( మొక్కల హానికారి), నాపాలం (మనుషుల హానికారి).
- NLF: జాతీయ విముక్తి సమాఖ్య. ఇది 1975 ఏప్రిల్ 30 నాటికి వియత్నాన్ని ఒకటిగా చేసింది.
- నైజీరియా: ఇది బ్రిటన్ వలస రాజ్యం.
- నైజీరియాలోని జాతులు: హౌసా పులాని, యొరుబా, ఈబో
- NNDP: నైజీరియా జాతీయ ప్రజాస్వామిక పార్టీ. దీనిని 1923 లో హెర్బర్ట్ మకాలే స్థాపించారు.
- NYM: నైజీరియా యువ ఉద్యమం. దీనిని 1936 లో ఎన్ నంది అజికివె స్థాపించారు.
- NCNC: నైజీరియా, కామెరున్ ల జాతీయ సంఘం. దీనిని  మకాలె, ఎన్ నంది అజికివె కలిపి ఏర్పాటు చేసారు.
- ఖండాంతర ఆఫ్రికావాదం: దేశ, తెగ తేడాలు లేకుండా ఆఫ్రికా ప్రజలందరు ఒకటే అనే భావనను ఖండాంతర ఆఫ్రికా వాదం అందురు. దీనిని క్వామెన్ క్రూమా ప్రచారంలోకి తీసుకురావటంలో ప్రముఖ పాత్ర పోషించారు.
- నైజీరియాకు స్వాతంత్ర్యం: 1963 అక్టోబర్ 1 న నైజీరియా స్వాతంత్ర్యం పొందింది.
- బలహీన ప్రజాస్వామ్యం: నైజీరియా స్వాతంత్ర్యం పొందిన తరువాత ఆ దేశంలో పౌర యుద్ధం కారణంగా ఆ దేశంలో అస్థిర ప్రజాస్వామ్యం కొనసాగింది. ఇదే బలహీన ప్రజాస్వామ్యంగా పిలువబడింది.
- స్వాతంత్ర నైజీరియా ఎదుర్కొన్న సమస్యలు: అస్థిర ప్రభుత్వం, పర్యావరణ కాలుష్యం.
- కెన్ సారో వివా: నైజీరియాలో పర్యావరణ ఉద్యమాన్ని నడిపారు.

www.digitalsocialteacher.in

## 2 & 4 మార్కుల ప్రశ్నలు

**. క్రింది వాటిని జత పరచండి.**

| | | | |
|---|---|---|---|
| ఎ) సన్-యెట్ - సెన్ | ( iii ) | i. | దేశాన్ని సైనిక దేశం చేశాడు |
| బి)చియాంగ్ కాయ్‌షేక్ | ( i ) | ii. | పర్యావరణ ఉద్యమం |
| సి)మావో జెడాంగ్ | ( iv ) | iii. | జాతీయతా వాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం |
| డి) కెన్ సారో నివా | ( ii ) | iv. | రైతాంగ విప్లవం |

**౨. దశాబ్దాల కాలంలో చైనాలో మహిళల పాత్రలో వచ్చిన మార్పులను గుర్తించండి. రష్యా, జర్మనీలో సంభవించిన మార్పులకూ, వీటికీ తేడాలు, పోలికలు ఏమిటి?**

చైనాలో మహిళల పాత్రలో వచ్చిన మార్పులు:

i. ప్రాచీన చైనాలో మహిళలకు స్వేచ్ఛ లేకుండా ఉండేది. వారు పరాధీనులై ఉండేవారు.

ii. ఆడపిల్లల పాదాలు పూర్తిగా పెరగకుండా నిరోధించడానికి వారి పాదాలు కట్టివేయడం జరిగేది.

iii. చియాంగ్ కాయ్‌షేక్ కాలంలో మహిళల పరిస్థితి దారుణంగా ఉండేది.

iv. 'పాతివ్రత్యం, రూపం, మాట, పని' అన్న నాలుగు సుగుణాలపై వాళ్ళ శ్రద్ధ పెట్టాలని భావించేవారు. వారు ధరించే గౌనులు ఎంత పొడవు ఉండాలో కూడా నిర్ణయించేవారు.

v. మావో కాలంలో గ్రామీణ మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. కొత్త వివాహ చట్టం చేశాడు.

vi. 1949లో చైనా ప్రజల గణతంత్రం ఏర్పడిన తర్వాత మహిళల రక్షణకు, వారి హక్కులకు, బహు భార్యత్వ నిషేధానికి కొత్త ప్రభుత్వం చట్టాలు చేసింది. దీని వల్ల మహిళలు పురుషులలో సమానంగా వివిధ రంగాలలో సమాన హోదా పొందారు.

రష్యా, జర్మనీలో సంభవించిన మార్పులకు చైనాలోని పరిస్థితులకు తేడాలు, పోలికలు :

రష్యా

i. రష్యాలు మహిళలు పురుషులకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలు చేపట్టేవారు.

ii. హక్కుల కోసం పోరాడటంలో పురుషుల కంటే ముందున్నారు.

iii. మహిళా దినోత్సవం వంటి సందర్భాలలో ఉత్సవాలు జరిపి పురుషులకు ఎర్ర మెడ పట్టీలను బహుమతిగా ఇచ్చేవారు.

iv. 'రొట్టె, శాంతి' కోసం ఉద్యమించి దేశాన్ని ఉద్యమ పథంవైపు నడిపించేవారు.

జర్మనీ

i. జర్మనీలో మహిళల పరిస్థితి దారుణంగా ఉండేది.

ii. పురుషుల రంగంలో మహిళలు జోక్యం చేసుకోరాదు.

iii. హిట్లర్ అభిప్రాయంలో 'ఈ లోకంలోకి మహిళ తెచ్చే ప్రతి సంతానము ఒక యుద్ధమే. తన ప్రజలకోసం మహిళ ఈ పోరు సలుపుతోంది.

**3. రాచరిక పాలనను పడదోసిన తర్వాత చైనాలో రెండు రకాల పాలనలు ఏర్పడ్డాయి. వీటి మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?**

i. చైనాలో పరిపాలన కొనసాగిస్తున్న 'మంచూ' సామ్రాజ్యాన్ని 1911లో సన్-యెట్-సెన్ కూల దోసి 'గణతంత్ర రాజ్యాన్ని' ఏర్పాటు చేశాడు.

ii. తర్వాత కాలంలో మావోజెడాంగ్ నాయకత్వంలో 'చైనా కమ్యూనిస్ట్ పార్టీ' అధ్వర్యంలో 'నూతన ప్రజాస్వామ్య" పాలన ఏర్పడింది.

వీటి మధ్య పోలికలు, తేడాలు క్రింద వివరించ బడ్డాయి.

పోలికలు:

i. రెండు పాలనలు కూడా చైనాలో అనేక సంస్కరణలు అమలు చేశాయి.

ii. సన్-యెట్-సన్ ఆధ్వర్యంలోను, మావో ఆధ్వర్యంలోను మహిళలలకు రక్షణనిచ్చి వారి హక్కులపై అవగాహన కల్పించారు.

iii. భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొని భూమిలేని వారికి పంచి భూసంస్కరణలను సమర్థంగా అమలు చేశారు.

తేడాలు:

| గణతంత్ర్య రాజ్యం | నూతన ప్రజాస్వామ్యం |
|---|---|
| 1. సామ్యవాదం, జాతీయవాదం, ప్రజాస్వామ్యం పునాదులపై నిర్మించబడింది. | 1. భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం వ్యతిరేకతతో నిర్మించబడింది. |
| 2. సామాజిక మూలాలు పట్టణాలలో ఉన్నాయి. | 2. సామాజిక మూలాలు గ్రామాలలో ఉన్నాయి. |
| 3. చియాంగ్ కాయ్‌షేక్ కాలంలో మహిళలలను ఇంటికి పరిమితం చేయడం జరిగింది. | 3. మహిళలలకు అన్ని రకాలు స్వేచ్ఛలు, హక్కులు కల్పించారు. |
| 4.సంకుచిత సామాజిక తతత్వం వలన దేశంలో ఏకత్వం సాధించలేక పోయింది. | 4. అన్ని వర్గాలను కులుపుకొని పోవడం వల్ల ఏకత్వాన్ని సాధించారు. |

**4. చైనా, వియత్నాం, నైజీరియా దేశాలు ప్రధానంగా వ్యవసాయం పైన ఆధారపడినవే. అందులో పద్ధతులు మార్చడానికి ఈ దేశాలలో ఎటువంటిప్రయత్నాలుజరిగాయి?**

చైనా:

i. మావో జెడాంగ్ కాలంలో వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

ii. భూసంస్కరణలు అమలు చేసి ''పనిబృందాలు' ఏర్పరచి వ్యవసాయాన్ని ప్రోత్సాహించారు.

వియత్నాం:

i. ఫ్రెంచి వారి పాలనలో వియత్నాంను 'వరి' ని ఎగుమతి చేసే దేశంగా చేయాలని భావించి దాన్ని సాధించారు.

ii. ఇందుకోసం సాగునీటి సదుపాయాలను మెరుగు పరచారు. భూస్వాములను ప్రోత్సహించారు.

iii. బీడు భూముల నుంచి నీటినితోడి కాలువల నిర్మాణం చేపట్టారు.

iv. వరి, రబ్బరు ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించారు.

నైజీరియా:

i. నైజీరియాలో బానిసల వ్యాపారాన్ని నిషేధించిన తర్వాత వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు.

ii. కోకో, పామాయిల్ వంటి పంటలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సాహించారు.

**5. పైన చర్చించిన దేశాలలో (చైనా, వియత్నాం, నైజీరియా) పరిశ్రమలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? ఈ పద్ధతులు మార్చడానికి ఎటువంటి ప్రయత్నాలు జరిగాయి. పోల్చటానికి ఒక పట్టికను తయారు చేయండి.**

| చైనా | వియత్నాం | నైజీరియా |
|---|---|---|
| i. సన్-యెట్-సన్ కాలం లో పరిశ్రమల మూలాలు ప్రధానంగా పట్టణ ప్రాంతాలలో ఉండేవి.పారిశ్రామిక ప్రగతి పరిమితంగాను, నిదానంగాను ఉంది.షాంఘై వంటి నగరాలలో 1919 నాటికి 5 లక్షల పారిశ్రామిక కార్మిక వర్గం ఏర్పడింది. ఈ పరిశ్రమలన్నీ శ్రామిక వర్గం చేతిలో ఉండేవి. | i. ఫ్రెంచి పాలనలో వియత్నాంలో పారిశ్రామిక ప్రగతికి ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు.<br>ii. వియత్నాంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేశారు.<br>iii. బియ్యం మిల్లులు, రబ్బరు తయారీ పరిశ్రమలు మాత్రమే స్థాపించబడ్డాయి. | i. నైజీరియా ప్రధాన వనరు చమురు. 1950లో చమురును కనుగొన్న తర్వాత వివిధ బహుళజాతి కంపెనీలు వెలికి తీసే హక్కులను పొందాయి.<br>ii. ఇవి చమురును వెలికి తీసి తమ లాభాల్లో అప్పటికి సైనిక ప్రభుత్వానికి వాటా ఇచ్చాయి.<br>iii. సామాన్య ప్రజలు మాత్రం ఇబ్బంది పడ్డాయి. చమురు |

| | | |
|---|---|---|
| ii. చియాంగ్ కాయ్‌షేక్ కాలం లో ఫ్యాక్టరీ యజమానులను ప్రోత్సాహించడానికి, కార్మిక సంఘాలను అణచివేయడానికి పూనుకున్నాడు.<br>iii. మావోజెడాంగ్ అధికారంలోకి వచ్చాక తిరిగి కార్మిక సంఘాలకు ప్రాధాన్యత లభించింది. పరిశ్రమలను జాతీయం చేయడం జరిగింది. | iv. పంటలు, వాణిజ్య సరుకుల రవాణా కోసం రోడ్డు, రైలు మార్గాలు అభివృద్ధి చేశారు. | వెలికితీత వల్ల జరిగిన పర్యావరణ కాలుష్యం వల్ల భూమి, నీళ్ళు కలుషితమై అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. |

**6. భారత దేశం, నైజీరియాలలోని జాతీయ ఉద్యమాలను పోల్చండి. భారతదేశంలో ఇది ఎందుకు బలంగా ఉంది?**

**భారతదేశంలో జాతీయ ఉద్యమం:**

i. భారతదేశ జాతీయోద్యమము సుధీర్ఘంగా కొనసాగింది. ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

ii. సరిగ్గా 100 సంవత్సరాల తర్వాత 1857లో బ్రిటిష్‌కు వ్యతిరేకంగా మొదటి సారి తిరుగు బాటు జరిగింది.

iii. బ్రిటిష్ వారు అనుసరించిన అనేక విధానాలు భారతీయులు ఏకం కావడానికి దోహదం చేశాయి.

iv. ఆంగ్ల విద్యను నేర్చిన భారతీయులు స్వేచ్ఛ, సమానత్వము, ప్రజాస్వామ్యం వంటి భావాలను తెలుసుకొని జాతీయ స్ఫూర్తిని పెంపొందించారు.

v. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, రామకృష్ణ మిషన్, దివ్యజ్ఞాన సమాజం మొ॥సంస్థలు స్థాపించి సంస్కరణ ఉద్యమాలు న డిపారు. ఇవి జాతీయ ఉద్యమం బలపడటానికి దోహదం చేశాయి.

నైజీరియా:

i. మూడు ప్రధానమైన తెలగు హౌసా-ఫులాని, ఈబో, యొరుబాలు ఉన్నాయి.

ii. ఇక్కడ కూడా బ్రిటిష్ వారు 'విభజించు-పాలించు' విధానాన్ని అనుసరించారు.

iii. భారతదేశ జాతీయ నాయకుడు గాంధీజీ కాగా, నైజీరియా జాతీయ నాయకుడు ఎన్ నంది అజికివె.

భారతదేశంలో బలమైన జాతీయ ఉద్యమానికి కారణం:

నైజీరియాతో పోలిస్తే భారతదేశంలో జాతీయ ఉద్యమం బలంగా ఉంది. ఎందుకుంటే విద్యావంతులు, ప్రపంచం మెచ్చే మేధావులు దానికి నాయకత్వం వహించారు. భారతీయ సాంస్కృతిక పునాది కూడా చాలా బలమైనది.

**7. స్వతంత్ర నైజీరియా దేశం ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి? స్వతంత్ర భారతదేశం ఎదుర్కొన్న సవాళ్లలో పోలికలు**

## తేడాలు ఏమిటి?

**స్వతంత్ర నైజీరియా దేశం ఎదుర్కొన్న సవాళ్లు:**

i. 1963 అక్టోబరి 1 న నైజీరియా స్వాతంత్ర్యం పొందింది. కాని ప్రజాస్వామిక న్యాయపూరిత సమతుల్యం సాధించలేక పోయింది.

ii. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే పౌర యుద్ధం (అంతర యుద్ధం) చెలరేగింది.

iii. తద్వారా నైజీరియాలో సైనిక పాలన ఏర్పడి ఉత్తర ప్రాంత ఆధిపత్యధోరణిని కొనసాగించింది.

iv. సైనిక పాలనలో అవినీతి, విస్తరించింది. మానవహక్కుల ఉల్లంఘన కొనసాగింది.

v. అవినీతి పాలకులకు బహుళ జాతి కంపెనీలు మద్దతు ఇచ్చాయి.

vi. చమురును వెలికి తీసే ప్రయత్నంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేకపోవడం వల్ల అనేక పర్యావరణ సమస్యలను ఎదుర్కొన్నారు.

భారదేశంఎదుర్కొన్న సవాళ్లలో పోలికలు:

| **భారతదేశం** | **నైజీరియా** |
|---|---|
| 1. మత ఘర్షణలు చెలరేగాయి. | 1. పౌరయుద్ధం చెలరేగింది. |
| 2. అవినీతి పెరిగిపోయింది. | 2. అవినీతి పెరిగింది. |
| 3. అడవుల నరివేత వల్ల పర్యావరణ సమస్యలు ఏర్పడ్డాయి. | 3. చమురు వెలికితీత వల్ల పర్యావరణ సమస్యలు ఏర్పడ్డాయి. |
| 4.నిరుద్యోగము, పేదరికము విస్తరించాయి. | 4. నిరుద్యోగము, పేదరికము పెరిగింది. |

తేడాలు:

| భారతదేశం | నైజీరియా |
|---|---|
| 1. ప్రజాస్వామ్యం ఏర్పడి విజయవంతంగా కొనసాగింది. | 1. సైనిక పాలన ఏర్పడింది. |
| 2. 1950 నుంచి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. | 2. రాజ్యాంగ తయారీ జరగలేదు. |
| 3. ఎలాంటి మానవ హక్కుల ఉల్లంఘన జరగలేదు. | 3. మానవ హక్కుల ఉల్లంఘన యధేచ్చగా జరిగింది. |
| 4. ప్రజలు స్వేచ్ఛ, సమానత్వము పొందారు. | 4. ప్రజలు సైనిక పాలన నిర్బంధాలను ఎదుర్కొన్నారు. |
| 5. దేశం రెండుగా విడిపోయింది. | 5. దేశ విభజన జరగలేదు. |

**8. భారతదేశం, వియత్నాంలాగ స్వాతంత్ర్యం కోసం నైజీరియా మరీ అంత కష్టపడాల్సి రాలేదు. దీనికి కొన్ని కారణాలను పేర్కొనండి.**

భారతదేశం, వియత్నాంల లాగ స్వాతంత్ర్యం కోసం నైజీరియా మరీ అంత కష్టపడాల్సి రాలేదు. దీనికి క్రింది కారణాలు తెలుపవచ్చు.

1. భారతదేశము సువిశాలమైన దేశం, అనేక మతాలు, భాషలు, కులాలు సంస్కృతులు ఉన్నాయి. వీరందరి మధ్య ఐక్యమత్యం సాధించడం కష్టమైంది.
2. భారతదేశంలోని చిన్న చిన్న రాజ్యాలను పరిపాలించిన రాజుల మధ్య కూడా ఐకమత్యం లేదు. 200 సం॥సుదీర్ఘ పోరాటం తర్వాత స్వాతంత్ర్యం వచ్చింది.
3. వియత్నాంను రెండు దేశాలు (ఫ్రెంచి, జపాను) పరిపాలించాయి.
4. వాటి నుంచి స్వాతంత్ర్యం సాధించుకోవడానకి చాలా కష్టపడాల్సి వచ్చింది.
5. మరొక వైపు అమెరికాలో యుద్ధం చేయాల్సి వచ్చింది.
6. వీటి తో పోల్చుకుంటే నైజీరియన్లు పడిన శ్రమ చాలా తక్కువే.
7. దీని కొరకు వారు రెండు వ్యూహాలు అనుసరించారు. ఎ. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేయడం. బి. వివిధ తెగాల మధ్య ఐకమత్యం సాధించడం.
8. పరస్పరం ఘర్షణ పడుతున్న వివిధ తెగల మధ్య ఐకమత్యం సాధించడంతో స్వాతంత్ర్యం పొందడం సులభమైంది.

**9. పైన చర్చించిన దేశాల (చైనా, వియత్నాం, నైజీరియా) లోని జాతీయ ఉద్యమాలలో పాఠశాల విద్య పాత్ర ఏమిటి?**

చైనా:

i. జాతీయోద్యమ కాలంలో చైనాలో విద్య, అక్షరాస్యతలను వ్యాపింప చేయడానికి పెద్ద ఎత్తున వయోజన రైతాంగ పాఠశాలలను ప్రారంభించారు.
ii. గ్రామాల్లోని చిన్న పిల్లలకు, పెద్ద వాళ్ళకు ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు.
iii. అందరికీ ప్రాథమిక విద్యను అందించడంలో సాధించిన విజయాలు చైనా భవిష్యత్తు ప్రగతికి బలమైన పునాదిగా నిలిచాయి.

వియత్నాం:

i. ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన వియత్నామీ భాషలో ఉండేది.ఉన్నత విద్య మొత్తం ఫ్రెంచి భాషలో ఉండేది.
ii. పాఠ్య పుస్తకాలు ఫ్రెంచి వాళ్ళను పొగుడుతూ వలస పాలనను సమర్థించేవి.
iii. ఫ్రెంచి వాళ్ళు ఇచ్చిన పాఠ్యాంశాలను టీచర్లు, విద్యార్థులు గుడ్డిగా అనుసరించలేదు
iv. టీచర్లు పాఠాలలో ఉన్న దానిని మార్చి ఫ్రెంచి ప్రభుత్వాన్ని విమర్శించే వారు.
v. ఈ ప్రయత్నాల వల్ల ఫ్రెంచి ప్రభుత్వ నిర్ణయాలను విద్యార్థులు ప్రతిఘటించారు.

నైజీరియా:

i. వలస పాలకుల విధానాల వల్ల దక్షిణ ప్రాంతంలో ఆధునిక విద్య లభించగా ఉత్తర భాగంలో పూర్వ సాంప్రదాయాలు కొనసాగాయి.

ii. పాశ్చాత్య విద్య పొందిన కొంత మంది 'ఉమ్మడి నైజీరియా దేశం' అన్న భావనను కలిగించి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడారు.

**10. ఈ దేశాల స్వాతంత్ర్య పోరాటాలలో పాలకులపై యుద్ధాలు చేశారు. వాటి ప్రభావాన్ని క్లుప్తంగా వివరించండి.**

చైనా:

i. చైనాలో స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రధానంగా రెండు పార్టీలు కృషి చేశాయి. గయోమిండాంగ్, చైనా కమ్యూనిస్ట్ పార్టీ.

ii. మావోజెడాంగ్ భూస్వామ్యాన్ని అంతం చేయడానికి రైతాంగ సైన్యాన్ని ఏర్పరచాడు.

iii. అధికార గయోమిండాంగ్, మావోనాయకత్వంలోని సిపి మధ్య తీవ్ర పోరాటం జరిగింది.

iv. అయితే 1937-45 మధ్యకాలంలో జపాన్ చైనాపై దండెత్తినపుడు ఈ పార్టీలు చేతులు కలిపి ధీటుగా ఎదుర్కొన్నాయి.

v. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ లొంగిపోయిన తర్వాత చైనాపైప పట్టుకొరకు ఈ రెండు పార్టీలు పోటీ పడ్డాయి. చివరికి చైనాపై చైనా కమ్యూనిస్ట్ పార్టీ విజయం సాధించి 1949లో 'చైనా ప్రజల గణతంత్రం' ఏర్పరచింది.

వియత్నాం:

i. స్వాతంత్ర్య పోరాటంలో వియత్నాం మూడు దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చింది.

ii. మొదటి వలస పాలకులైన ఫ్రెంచి వారితో సుదీర్ఘమైన జాతీయ పోరాటం చేశారు.

iii. 1940లో జపాన్ వియత్నాంను ఆక్రమించడంతో జపాన్ కి వ్యతిరేకంగా పోరాడ వలసి వచ్చింది.

iv. వియత్నాంలో కమ్యూనిస్టుల ప్రభావాన్ని ఎదుర్కోవడానికి అమెరికా దాడి చేసింది.

v. అమెరికా వియత్నాంపై విషపూరితమైన 'ఏజెంట్ ఆరంజ్' లాంటి విష రసాయనాలు ప్రయోగించింది.

vi. అమెరికా దాడిని వియత్నామీయులు ధీటుగా ఎదుర్కోవడంలో అమెరికా కూడా చాలా నష్టపోవాల్సి వచ్చింది. 1974 లో జరిగిన సంధి ద్వారా యుద్ధం ముగిసింది.

నైజీరియా:

i. నైజీరియాలో ఎన్ నంది అజికివె నాయకత్వంలో నైజీరియా, కామెరూన్ల జాతీయ సంఘం(ఎన్‌సీఎన్‌సీ) ఏర్పడి జాతీయోద్యమానికి నాయకత్వం వహించింది.

ii. వీరు తీవ్ర యుద్ధం ఏమీ చేయలేదు కొద్దిపాటి పోరాటంతోనే 1963 అక్టోబర్ 1 న స్వాతంత్ర్యం పొందారు.

iii. కాని తర్వాత నైజీరియాలో పౌర యుద్ధం చెలరేగి సైనిక పాలన ఏర్పడింది.

iv. దీనికి వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటం జరిగి చివరకు 1999లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడింది.

v. చమురు వెలికి తీతలో జరిగే పర్యావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా కూడా సుదీర్ఘ పోరాటం చేశారు.

**Prepared by:**

**Rambabu Sunkari**

**SA(SS)**

**ZPHS, Garudabilli**

**Vizianagaram Dt**

www.digitalsocialteacher.in